
సాక్షి పల్నాడు

శుక్రవారం । 31 । మే । 2024



కార్డెన్ సెర్చ్

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరంలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. కొత్తపేట పీఎస్ సీఐ షేక్ అన్వర్‌బాషా, లాలాపేట సీఐ పి.దేవప్రభాకర్ పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 504.70 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

రామాలయంలో హనుమ జయంతి



సత్తెనపల్లి: సత్తెనపల్లి గడియార స్తంభం వద్ద గల కోదండ రామాలయంలో గురువారం హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. ముందుగా హనుమత్ విగ్రహానికి తులసి మాలలతో పూజలు చేశారు.

న్యూస్‌రీల్

లాసెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: లాసెట్–2024కు హాజరు కానున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు జాగర్లమూడి చంద్రమౌళి (జేసీ) న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినేని సుధాకరబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ ఒకటో తేదీ ఉదయం 9 గంటలకు శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని, 25 ఏళ్లుగా ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు వివరించారు. మూడేళ్ల, ఐదేళ్ల లా కోర్సులకు జూన్ 9న ప్రవేశ పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ఇతర వివరాలకు 0863–2350330, 98485 50353 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హనుమాన్ శోభా యాత్రను జయప్రదం చేద్దాం



మంగళగిరి: జూన్ 1న హనుమజ్జయంతిని పురస్కరించుకుని బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన హనుమాన్ శోభాయాత్రను భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్రీయ సాధు సంరక్షణ సంఘం అధ్యక్షుడు కళ్యానంద స్వామీజీ కోరారు. మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెదవడ్లపూడి సాయిబాబా ఆలయంలో గురువారం హనుమాన్ శోభాయాత్ర వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. స్వామీజీ మాట్లాడుతూ హనుమజ్జయంతి రోజు భక్తులంతా భారీగా తరలివచ్చి శోభా యాత్రలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి ప్రాతూరి నాగభూషణం, రామినేని ఫౌండేషన్ చైర్మన్ ధర్మ ప్రచారక్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగాలు




గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో పాలిటెక్నిక్ విద్య పూర్తి చేసిన విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు తెలిపారు. గురువారం కళాశాలలో నిర్వహించిన జాబ్ అచీవర్స్ డే కార్యక్రమంలో ఉద్యోగాలకు ఎంపికైన 16 మంది విద్యార్థులకు నియామకపత్రాలు అందజేశారు. పాలిటెక్నిక్ పూర్తయిన తరువాత ఉద్యోగం చేస్తూనే, ఉన్నత విద్య అభ్యసించేందుకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆదేశాల మేరకు వచ్చే విద్యాసంవత్సరం నుంచి మరిన్ని ప్రముఖ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని, ప్రతి విద్యార్థికీ ఉద్యోగ కల్పన లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.ఐజాక్‌ప్రసాద్, ప్లేస్‌మెంట్ అధికారి కొల్లా సుశ్మిత, విభాగాధిపతులు చల్లా జ్యోతిర్మయి, కర్రా దీపిక పాల్గొన్నారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో గురువారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు 263 మంది విద్యార్థులు హాజరైనట్లు హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. శుక్రవారం జరగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు 59,001 నుంచి 75 వేలు ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

విజయకీలాద్రిపై హనుమజ్జయంత్యుత్సవాలు



తాడేపల్లి రూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై హనుమజ్జయంత్యుత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న జీయర్‌స్వామి మంగళ శాసనాలతో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామని, మొదటిరోజు గురువారం ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం, అనంతరం మన్యుసూక్త హోమం, విశేష అలంకరణ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. జూన్ 1న హనుమజ్జయంతి సందర్భంగా విశేష పూజలు, తీర్థప్రసాద గోష్ఠి ఉంటాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, అనంత స్వామి, వేదవిద్యార్థులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం

- సాధారణ సాగు లక్ష్యం 3.18 లక్షల హెక్టార్లు
- ఖరీఫ్‌లో 3.17 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
- మార్కెట్‌లో అందుబాటులో 26 లక్షల పత్తి, మిర్చి విత్తనాల ప్యాకెట్లు
- ఈ ఏడాది వాతావరణం అనుకూలిస్తుందన్న సంకేతాలు
- మరింత సాగుకు అన్నదాతలు మొగ్గుచూపుతారన్న జేడీఏ మురళి

సాగు ప్రణాళిక ఖరారు చేసిన వ్యవసాయశాఖ



దుక్కులను సిద్ధం చేస్తున్న అన్నదాత

నరసరావుపేట రూరల్: నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని వాతావరణ శాఖ ప్రకటించడంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తమవుతుంది. సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు అవుతుందనే సంకేతాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మే నెలలో సాధారణ వర్షపాతం 45.9 మి.మీ కాగా ఇప్పటికే జిల్లాలో 84.2మి.మీ వర్షం కురిసింది. దీంతో వ్యవసాయ శాఖ ఖరీఫ్ ప్రణాళికను సిద్ధం చేసింది. 3.18 లక్షల హెక్టార్లలో వివిధ రకాల పంటల సాగు లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు రైతు పక్షపాత ప్రభుత్వంగా మన్ననలు పొందిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు జిల్లాలోని 421 రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందజేస్తున్నారు. మట్టి పరీక్షలు నిర్వహించి రైతులకు అవసరమైన సూచనలు ఆర్బీకేల ద్వారా చేస్తున్నారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రైతులకు విరివిగా పంట రుణాలు ఇప్పించే ఏర్పాట్లు చేస్తున్నారు.

తగ్గుతున్న పత్తి సాగు

జిల్లాలో ప్రధానంగా పత్తి, మిరప, వరి పంటలను రైతులు సాగు చేస్తున్నారు. పత్తి సాగు గతంతో పోలిస్తే తగ్గుతూ వస్తుంది. పత్తి సాధారణ విస్తీర్ణం 1.20లక్షల హెక్టార్లు కాగా గతేడాది లక్ష హెక్టార్లలోనే పత్తి పంటను సాగుచేశారు. ఈ ఏడాది దీని కన్నా తక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. వరి సాగు సాధారణ విస్తీర్ణం 50వేల హెక్టార్లుగా, మిర్చి సాగు సాధారణ విస్తీర్ణం 58వేల హెక్టార్లుగా ఉంది. నాగార్జునసాగర్ ఆయకట్టు నుంచి నీటి విడుదల లేకపోవడతో గతేడాది వరి సాగు నామమాత్రంగా జరిగింది. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురుస్తుండడంతో సాగర్ నుంచి నీటి విడుదలపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. నీటి లభ్యత లేకపోవడంతో వర్షాధార పంట కంది సాగు గతేడాది గణనీయంగా పెరిగింది. జిల్లాలో 21వేల హెక్టార్లలో కంది పంట సాగు జరిగింది.

అందుబాటులో ఎరువులు

ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులను వ్యవసాయ శాఖ అందుబాటులో ఉంచింది. ఎరువుల కొరత లేకుండా సకాలంలో రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటుంది. దాదాపు 3.17లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాలో ఖరీఫ్‌కు అవసరమవుతాయి. యూరియా 1.42 లక్షల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 1.32 లక్షల మెట్రిక్ టన్నులు, డీఏపీ 62 వేల మెట్రిక్ టన్నులు అవసరమవుతాయి. అందులో ప్రస్తుతం 72,930 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాలో సిద్ధంగా ఉన్నాయి. ఏపీ మార్క్‌ఫెడ్, హోల్‌సెలర్స్, రిటైలర్స్, కంపెనీ గొడన్‌లు, ఆర్బీకేల ద్వారా వీటిని రైతులకు సరఫరా చేసేందుకు ఏర్పాటుచేసింది. ఆర్బీకేల ద్వారా 75వేల మెట్రిక్ టన్నుల ఎరువులను అందించాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

విత్తనాలు సిద్ధం

విత్తన కొరత లేకుండా రైతులు అదునులో పంటల సాగును ప్రారంభించే విధంగా వ్యవసాయ శాఖ విత్తనాలను సిద్ధం చేస్తుంది. ప్రధానంగా పత్తి, మిరప, కంది, వరి విత్తనాలను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటుంది. పత్తి విత్తనాలు 7.65 లక్షల ప్యాకెట్లు, మిర్చి విత్తనాలు 18.80లక్షల ప్యాకెట్లు, 10వేల క్వింటాళ్ల వరి వంగడాలు జిల్లాకు అవసరమని ప్రణాళిక రూపొందించింది. ఈ మేరకు విత్తన కొరత లేకుండా విత్తన కంపెనీలతో సమన్వయంతో ముందుకు సాగుతుంది.

సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులు

రైతులను సాగుకు సమాయత్తం చేసే కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువులను పంపిణీ చేస్తున్నారు. 50శాతం సబ్సిడీపై జీలుగు, జనుము, పిల్లిపెసర ఎరువులను ఆర్బీకేల ద్వారా అందజేస్తున్నారు. జిల్లాలో 6,235 క్వింటాళ్ల ఎరువులను రైతులకు సరఫరా చేస్తున్నారు. ఇందుకోసం దాదాపు రూ.3.10 కోట్లు సబ్సిడీని ప్రభుత్వమే భరిస్తుంది.

పంటల సాగు విస్తీర్ణం, అవసరమైన విత్తనాలు

పంట	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	అవసరమైన విత్తనాలు (ప్యాకెట్లలో)
పత్తి	1,20,000	7,65,625
మిర్చి	58,000	18,80,000
వరి	50,000	10,000
కంది	10,000	300

ఎరువులు అందుబాటులో ఇలా...

ఎరువులు	ఖరీఫ్ కేటాయింపు (టన్నుల్లో)
యూరియా	1,42,000
డీఏపీ	62,000
కాంప్లెక్స్	1,30,000
పొటాష్	16,000
సూపర్‌ఫాస్పేట్ (ఇతర ఎరువులు)	10,000

ఖరీఫ్ సాగుపై ఆశలు



ఈ ఏడాది సకాలంలో రుతు పవనాలు రావడంతో పంటల సాగు ఆశాజనకంగా ఉంటుందని భావిస్తున్నాం. ఇప్పటికే సాధారణం కన్నా అధిక వర్షపాతం జిల్లాలో నమోదైంది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం 3.18లక్షల హెక్టార్లు కాగా, 3.27లక్షల హెక్టార్లు సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ మేరకు ప్రణాళికబద్ధంగా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేస్తున్నాం.

–ఐ.మురళి, పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి

రెంటచింతలలో భగభగలు

- ఎండకు అల్లాడుతున్న గ్రామస్తులు
- గరిష్ట ఉష్ణోగ్రత 45.7 డిగ్రీలు నమోదు



రెంటచింతల: రెంటచింతలలో గురువారం గరిష్ట ఉష్ణోగ్రత 45.7, కనిష్ట ఉష్ణోగ్రత 33.1 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలిపారు. రోహిణి కార్తె ప్రారంభం కావడంతో మరోసారి రెంటచింతల నిప్పులకుంపటిగా మారింది. వారం నుంచి గరిష్ట ఉష్ణోగ్రత 42 డిగ్రీల నుంచి ప్రస్తుతం 45.7 డిగ్రీల వరకు పెరుగుతూ ఉంది. ఉదయం 8 గంటల నుంచే ఎండతీవ్రత ఎక్కువగా ఉండటంతో గ్రామస్తులు అల్లాడిపోయారు. ఉదయం 11 గంటల నుంచి గ్రామంలోని మాచర్ల–గుంటూరు ప్రధాన రహదారితోపాటు గ్రామంలోని వీధులన్నీ జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిపోయాయి. తీవ్రమైన ఎండలు, ఉక్కపోత కారణంగా వృద్ధులు, చిన్న బిడ్డలు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ, తదితర పనులకు వెళ్లిన కూలీలు ఎండలకు భయపడి ఉదయం 11 గంటలలోపే ఇంటి బాట పడుతున్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2800, గరిష్ట ధర రూ.4500, మోడల్ ధర రూ.3400 వరకు పలికింది.

చికెన్ షాపు యజమాని హత్య

నిద్రిస్తున్న యజమానిని కత్తితో నరికి చంపిన పనివాడు



నిందితుల అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ అమీర్

కారెంపూడి: చికెన్ షాపు యజమానిని అతని అసిస్టెంట్ హత్య చేసిన ఘటన కారంపూడి మండలం పెదకొదమగుండ్ల గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..పెదకొదమగుండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయ సెంటర్‌లో గన్నె చికెన్ సెంటర్‌ను గ్రామానికి చెందిన దలావత్ గన్నె సాహెబ్(53) నిర్వహిస్తున్నాడు. సెంటర్‌లో చికెన్ కొట్టేందుకు అదే గ్రామానికి చెందిన షేక్ పెద్ద జానీ పని చేస్తున్నాడు. షాపులో పని ముగియగానే యజమాని గన్నె సాహెబ్ అతని అసిస్టెంట్ జానీ ఇద్దరు కలసి ఫుల్‌గా మద్యం తాగారు. మద్యం సేవిస్తున్న సమయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. తర్వాత జానీ షాపు నుంచి బయటకు వెళ్లిపోగా గన్నె సాహెబ్ షాపులోనే నిద్రకు ఉపక్రమించాడు. ఆ తర్వాత అర్ధరాత్రి జానీ షాపులోకి వచ్చి నిద్రిస్తున్న గన్నె సాహెబ్‌పై చికెన్ కొట్టే కత్తితో దాడి చేసి గొంతు, చేతులు, ఎదరు రొమ్ముపై తీవ్రంగా గాయపర్చి పరారయ్యాడు. తీవ్ర గాయాలతో షాపు నుంచి బయటకు వచ్చిన గన్నె సాహెబ్‌ను ఇరుగు పొరుగు వారు గమనించి గ్రామంలో ఆర్ఎంపీ వద్దకు తరలిస్తుండగానే ప్రాణాలు విడిచాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ మల్లికార్జున్, సీఐ ఎ శ్రీనివాసరావు, ఎస్ఐ కె.అమీర్ గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంటనే పోలీస్ జాగిలాలను రప్పించి నిందితుని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో పెదకొదమగుండ్ల గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల తరలించి సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుల అరెస్టు



హత్యకు గురైన గన్నె సాహెబ్

గన్నె సాహెబ్‌ను హత్య చేసిన నిందితుడు షేక్ పెద్ద జానీని అరెస్టు చేసినట్లు కారెంపూడి సీఐ ఎ శ్రీనివాసరావు, ఎస్ఐ కె అమీర్‌లు గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. డీఐజీ, ఎస్పీ ఆదేశాల మేరకు నిందితుల కోసం గాలించి కారెంపూడి చెక్‌పోస్టు సెంటర్‌లో అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

- గత 24వ తేదీ మిరియాల గ్రామంలో జరిగిన మరో హత్య కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ వెల్లడించారు. కుటుంబసభ్యుల మధ్య జరుగుతున్న గొడవను వారిస్తున్న జక్కా రాములమ్మ (83)ను ఆమె కుమారుడు రోకలిబండ తీసుకుని కొట్టడంతో ఆమె మృతి చెందిందని ఆ కేసులో కూడా నిందితుడిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. స్వల్ప కాలంలో హత్య కేసుల్లో నిందితులను అరెస్టు చేసిన ఎస్ఐ పోలీసులను సీఐ అభినందించారు. ఈ విషయంపై అధికారులకు నివేదిస్తామని సీఐ పేర్కొన్నారు.

పోలీసుల పవర్ చూపిస్తాం..

- ఎస్పీ మలికా గార్గ్
- కౌంటింగ్ సందర్భంగా శాంతి భద్రతలపై దిశానిర్దేశం
- అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదు
- పోలీసుల సత్తా ఏమిటో చూపిస్తాం
- పట్టణంలో పోలీసు కవాతు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ మలికాగార్గ్

నరసరావుపేటటౌన్: పోలీసులు సరిగ్గా పనిచేసి ఉంటే పోలింగ్ రోజు రాడ్లు, కర్రలతో బహిరంగంగా అరాచక మూకలు తిరిగేవారు కాదని, కానీ ఈసారి అరాచకవాదులకు పోలీసు పవర్ చూపుతామని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ పేర్కొన్నారు. బహిరంగంగా మద్యం తాగిన, రోడ్లపై రౌడీయిజం చేసినా ఉపేక్షించేది లేదు హెచ్చరించారు. గురువారం సాయంత్రం పల్నాడు బస్టాండ్ సెంటర్‌లో కవాతు నిర్వహించి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. జరిగిన హింసాత్మక సంఘటనలపై పోలీసు అధికారులు, సిబ్బంది లోపం ఏమైనా ఉందా అనే విషయంపై విచారించానన్నారు. పోలీసుల తప్పిదమేమీ కన్పించలేదు అన్నారు. పల్నాడు ప్రజలు చాలా మంచివారని, తప్పుడు డైరెక్షన్ వలన ఈవిధంగా ప్రవర్తించారన్నారు. దీంతో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లాకు చెడ్డపేరు వచ్చిందన్నారు. జిల్లాకు మంచిపేరు తీసుకొచ్చేందుకు పోలీసుశాఖ తీవ్రంగా కృషి చేస్తుందన్నారు. ఖాకీ పరిస్థితి బాగాలేదని, ఎవరికీ భయం లేకుండా పోయిందన్నారు. ఎన్నికల సమయంలో పోలీసులపై కూడా దాడులు జరిగాయన్నారు. ఇప్పుడు సమయం వచ్చింది, పరిస్థితిని చక్కదిద్దటంతో పాటు పోలీసు ప్రతిష్టను నిలబెట్టాల్సి ఉందన్నారు. పోలీసులు అంటే ఏమిటో ప్రతి ఒక్కరికీ చూపించాల్సిన అవసరం వచ్చిందన్నారు. ఇప్పుడు సక్రమంగా వ్యవహరిస్తే ఉన్న చెడ్డపేరును మార్చవచ్చన్నారు. ఎన్నికల కమిషన్‌కు కూడా పల్నాడుపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సమీక్షలో కూడా పల్నాడుపైనే ఎక్కువ చర్చించారన్నారు. మాచర్ల, నరసరావుపేటలలో జరిగిన హింసాత్మక సంఘటనలతో దేశం మొత్తం పల్నాడు వైపుకు చూసిందన్నారు. జూన్ నాలుగున కౌంటింగ్ జరుగుతున్నందున మళ్లీ అల్లర్లు చోటుచేసుకుంటే పోలీసుశాఖకు మరింత అప్రతిష్ట ఒనగూరుతుందన్నారు. దీని వలన పోలీసులపై ప్రజలకు ఉన్న నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. పోలీసుల ప్రతిష్టను పెంపొందించుకునేందుకు ఇదో చక్కని సదావకాశం. జిల్లాలో పోలీసులు రోడ్డుపై ఉంటే ఎవరూ ఏమీ చేయరనే నమ్మకం కలిగించాలన్నారు. ఎవరైనా బయటకు వచ్చి గొడవలు సృష్టిస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ చిరు వ్యాపారులు ఇబ్బందిపడకూడదన్న కారణంతో ఇప్పటివరకు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నామని అన్నారు. ఒకటో తేదీ నుంచి 144 సెక్షన్ పకడ్బందీగా అమలుచేస్తామన్నారు. ఎక్కడా నలుగురికి మించి జనం గుమికూడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎస్పీ డి.రామచంద్రరాజు, క్రైమ్ ఏఎస్పీ లక్ష్మీపతి, డీఎస్పీ సుధాకరరావు, సీఐలు కృష్ణారెడ్డి, భాస్కర్, మల్లికార్జునరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అవ్వాతాతల్లో పింఛన్ టెన్షన్

- బ్యాంక్ ఖాతాల్లోనే జూన్ నెల నగదు
- జిల్లాలో 2.10 లక్షల మందికి తప్పని అగచాట్లు



సత్తెనపల్లి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో కౌంటర్ల వద్ద పింఛన్‌దారులు(ఫైల్)

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడం, టీడీపీ అధినేత చంద్రబాబు, నిమ్మగడ్డ రమేష్‌చౌదరి అండ్ కో ఫిర్యాదుతో వలంటీర్ల సేవలు దూరం కావడంతో అవ్వాతాతలకు పింఛన్ కష్టాలు ఆరంభమయ్యాయి. ఇప్పుడు ఒకటో తేదీ వస్తుందంటే భయపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల పైగా నమోదవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనూ పింఛన్ నగదు డ్రా చేసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులను ప్రతిపక్షం వెతలకు గురిచేస్తోంది. ఒకటో తేదీ ఉదయాన్నే బ్యాంకుల వద్దకు చేరుకోవాల్సిన పరిస్థితిని కల్పించింది. పల్నాడు జిల్లాలో ప్రస్తుతం 2,81,325 మంది పింఛన్‌దారులు ఉన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మార్చి నెల వరకు పింఛన్ నగదు లబ్ధిని వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద అందించింది. ఎన్నికల నేపథ్యంలో విపక్షాల ఫిర్యాదుపై ఈసీ ఆదేశాల మేరకు వీరిలో 2,10,007 మందికి బ్యాంకులోను, 71,238 మందుకి సచివాలయ సిబ్బంది నేరుగా వారి ఇళ్లకు వెళ్లి గత నెల పింఛన్‌ల లబ్ధిని అందించారు. బ్యాంకుల్లో ఇప్పటికీ కొందరి ఖాతాలకు నగదు జమ కాకపోవడం, కొందరి ఖాతాల్లో మినిమమ్ బ్యాలెన్స్ లేక జమ చేసి నగదులో కోతపడటం వంటివి చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో బ్యాంకుల్లో నగదు తీసుకోవడం అవ్వా తాతలకు తలకు మించిన భారంగా మారింది.

రేపటి నుంచి పింఛన్ల పంపిణీ

నరసరావుపేట రూరల్: జూన్ 1వ తేదీన పింఛన్ పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 2,80,568 మంది పింఛన్‌దారులకు రూ.83.79 కోట్లు అందజేస్తామని తెలిపారు. డీబీటీ ద్వారా 2,05,607 మంది పింఛన్‌దారులకు రూ.61.68 కోట్లు, ఇంటి వద్దకే పంపిణీ ద్వారా 74,899మందికి రూ.22.08 కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. డీబీటీ ద్వారా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమచేస్తారని, సచివాలయాల వద్దకు లబ్ధిదారులు రావద్దని తెలిపారు. వడగాల్పులు అధికంగా ఉన్న నేపథ్యంలో బ్యాంక్‌ల వద్దకు రద్దీ ఉన్న సమయాల్లో వెళ్లకుండా ఉదయం, సాయంత్రం సమయాల్లో వెళ్లాలని సూచించారు. ఇంటి వద్దకే పెన్షన్ పంపిణీ చేసేందుకు నగదును ఈనెల 31వ తేదీ మధ్యాహ్నం 2గంటల లోపు బ్యాంక్‌ల నుంచి విత్‌డ్రా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జూన్ ఒకటి నుంచి 5వ తేదీ లోపు పింఛన్ పంపిణీని పూర్తిచేయాలని స్పష్టంచేశారు. పింఛన్‌దారుల సౌకర్యార్థం బ్యాంక్‌ల వద్ద టెంట్‌లు, తాగునీరు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.



క్లుప్తంగా

పిల్లల్లో ఆర్థోపెడిక్ లోపాలకు జూన్ 3న కోత, కుట్లు లేని చికిత్స

గుంటూరు మెడికల్: చిన్నపిల్లల్లో వంకర కాళ్ల లోపాలను సరిచేసేందుకు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిలో జూన్ 3న ఆర్థోపెడిక్ ఓపీ విభాగం ఆధ్వర్యంలో కోత, కుట్లు లేకుండా ఉచిత చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో క్యూర్ ఇండియా సౌజన్యంతో చేపట్టిన ఈ ఉచిత వైద్య శిబిర పోస్టర్‌ను గురువారం ఆస్పత్రి ఆర్థోపెడిక్ ఓపీలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ క్యూర్ ఇండియా స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో తిరిగి కాళ్ళు వంకరగా ఉన్న పిల్లలను గుర్తించి వారిని గుంటూరు జీజీహెచ్ ఆర్థో విభాగానికి తీసుకు వచ్చి చికిత్స చేయించేందుకు చేస్తున్న కృషిని అభినందించారు. వంకర పాదంతో పుట్టిన పిల్లలు వెంటనే చికిత్స చేస్తే దివ్యంగులు కాకుండా ఉంటారని వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్థో పెడిక్ విభాగాధిపతి డాక్టర్ యశశ్వి రమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని పాల్గొన్నారు.

కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లిన కారు



వెల్లటూరు(భట్టిప్రోలు): ఎదురుగా స్పీడ్ బ్రేకర్‌ను గమనించకపోవడంతో ఓ కారు కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లింది. పక్కనే ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ఉన్న తండ్రీకూతుళ్లకు గాయాలయ్యాయి. భట్టిప్రోలు మండలం వెల్లటూరు బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఈ ఘటన జరిగింది. భట్టిప్రోలు వైపు నుంచి వస్తున్న కారు కూరగాయల దుకాణంలోకి దూసుకెళ్లింది. కూరగాయలు చెల్లా చెదురయ్యాయి. ఆ పక్కనే ఉన్న కూల్‌డ్రింక్ షాప్ వద్ద ద్విచక్రవాహనంపై ఆగి ఉన్న తండ్రీకూతుళ్లను ఢీకొట్టింది. వారికి గాయాలయ్యాయి. వారి పూర్తి వివరాలు తెలియరాలేదు. క్షతగాత్రులను స్థానిక ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పలువురు భక్తులు గురువారం విరాళాన్ని అందజేశారు. పోరంకికి చెందిన బి.సత్యనారాయణ కుటుంబం బిట్రా సాంబశివరావు, జయలక్ష్మిల పేరిట రూ. 1,00,116 విరాళాన్ని ఈఓ కేఎస్ రామరావుకు అందజేశారు. ఏలూరు జిల్లా ఉంగుటూరుకు చెందిన నిడదవోలు శివప్రసాద్ కుటుంబం ఎస్.లక్ష్మీప్రశాంతి పేరిట రూ. 1,00,001 విరాళాన్ని అందజేసింది. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు.

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- గ్రామాలలో ప్రశాంతతకు విస్తృత బందోబస్తు
- కౌంటింగ్ అనంతరం 144 సెక్షన్ అమలు
- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్



మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్: జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపునకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్యాంప్రసాద్ చెప్పారు. గురువారం పలు పార్టీల అభ్యర్థుల ప్రతినిధులు, పోలీసు అధికారులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 4న నరసరావుపేటలో జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి హాజరయ్యే అభ్యర్థులు, ప్రతినిధులకు సూచనలు, మార్గదర్శకాలను వివరించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ, గ్రామాలలో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఇప్పటికే పలు గ్రామాలలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 1న పింఛన్ల పంపిణీకి సంబంధించి ఎంపీడీఓలు, తహసీల్దార్లకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధి కె వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మంజునాధ రెడ్డి, సీఐలు బ్రహ్మయ్య, సురేష్, ఎంపీడీఓ సరోజనీదేవి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌దాసు, డీటీ షేక్ బాషా, శర్మ, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో క్షయవ్యాధి రాదు

- టీబీ జాయింట్ డైరెక్టర్ రమేష్
- నరసరావుపేట, చిలకలూరిపేటల్లో పర్యటన



అరండల్‌పేట సచివాలయంలో అధికారులతో జాయింట్ డైరెక్టర్ రమేష్

నరసరావుపేట: బీసీజీ వ్యాక్సిన్ వేయించుకుంటే భవిష్యత్‌లో క్షయవ్యాధి రాదని రాష్ట్ర టీబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ పేర్కొన్నారు. గురువారం పల్నాడు జిల్లాలో జరుగుతున్న బీసీజీ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు వచ్చిన ఆయన స్థానిక రామిరెడ్డిపేట అర్బన్ పీహెచ్‌సీ కేంద్రం పరిధిలోని అరండల్‌పేట సచివాలయంలో ఏర్పాటుచేసిన వ్యాక్సిన్ కేంద్రం, బరంపేట పీహెచ్‌సీ పరిధిలోని ఏనుగుల బజారులో గల సచివాలయంలోని కేంద్రాలను సందర్శించారు. వ్యాక్సినేషన్ వేయించుకున్న వారితోపాటు అక్కడున్న ఆరోగ్య కార్యకర్త, ఆశాలతో మాట్లాడారు. ఈ వ్యాక్సిన్ వేయించుకోవటం వలన భవిష్యత్తులో క్షయవ్యాధి రాదని, 60ఏళ్ల నిండిన వృద్ధులు అందరూ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని కోరారు. అనంతరం చిలకలూరిపేట పట్టణంలోని సుగాలి కాలనీ అర్బన్‌సెంటర్ పరిధిలోని భావనారుషినగర్ సచివాలయం సందర్శించి వ్యాక్సిన్ కార్యక్రమం పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, జిల్లాటీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించేలా జగన్ పరిపాలన

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్

వెల్దుర్తి: రాష్ట్ర చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలన సాగిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. గురువారం పల్నాడు జిల్లా శ్రీరాంపురంతండాలో ఆయన మాట్లాడుతూ 2019లో 151 శాసనసభ స్థానాలు, 22 లోక్ సభ స్థానాలు వైఎస్సార్‌సీపీ గెలిచి మే 30న సీఎంగా జగన్ ప్రమాణస్వీకారం చేసి ఐదేళ్లలో ప్రజలు అభివృద్ధి చెందేలా పాలన చేశారన్నారు. ఆనాడు జగన్ చెప్పిన విధంగా మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి ఇవ్వని విధంగా డీబీటీ రూపంలో రూ. 2.70లక్షల కోట్లు, నాన్ డీబీటీ రూపంలో రూ. 1.79లక్షల కోట్లు మొత్తం రూ. 4.49లక్షల కోట్లు పేదలకు అందజేసి వారికి నేరుగా వారి ఖాతాలలో వేసి ప్రయోజనం చేకూర్చారని కొనియాడారు. మా ప్రభుత్వం వల్ల మీ ఇంట్లో మంచి జరిగి ఉంటేనే ఓట్లు వేయమని ప్రజలను కోరిన సీఎం దేశంలో జగన్ ఒక్కరేనన్నారు. ప్రజలను మోసం చేయడమే ఆస్తిగా వెన్నుపోటే పెట్టుబడిగా రాజకీయాల్లో ఎదిగిన నేత నారా చంద్రబాబు అని విమర్శించారు. రాష్ట్ర రూపురేఖలు మార్చేందుకు వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయం సాధించటం ఖాయమన్నారు. జూన్ 4న జరిగే ఎన్నికల ఓట్ల లెక్కింపులో వైఎస్సార్‌సీపీ అధిక శాసనసభ స్థానాలు కై వసం చేసుకుంటుందన్నారు. సీఎం జగన్ మరోమారు అధికారం చేపట్టనున్నారన్నారు.

ప్రకృతి సేద్యానికి రైతులు ముందుకు రావాలి



మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ అనంతు లక్ష్మణాచారి

భట్టిప్రోలు: ప్రకృతి సేద్యానికి రైతులు ముందుకు రావాలని డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్ అనంతు లక్ష్మణాచారి కోరారు. ప్రకృతి వ్యవసాయ విభాగం, గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ అధ్యక్షతన కన్వర్జన్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మణాచారి ప్రీమాన్ సూన్ డ్రైసోయింగ్ (పీఎండీఎస్)లో భాగంగా 30 రకాల విత్తనాలను తొలకరి జల్లులు పడుటకు ముందుగా వ్యవసాయ భూముల్లో చల్లి 45 రోజుల తరువాత భూమిలో కలియదున్నుట ద్వారా భూసారాన్ని పెంచవచ్చునని తెలిపారు. సేంద్రియ కిట్లు తయారీ, దేశవాళి ఆవుల కొనుగోలు, ఎన్‌పీఎం దుకాణాల ఏర్పాటుకు స్వయం సహాయక సంఘాలు, గ్రామైక్య సంఘాలు, మండల సమాఖ్యల ద్వారా రుణాలు ఇస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీసీపీఎన్ఎఫ్ అడిషనల్ డీపీఎం జె.మోహన్, ఎన్ఎఫ్ఏ శ్రీవల్లి, క్లస్టర్ కో–ఆర్డినేటర్లు, మండల సమాఖ్య ఈసీ సభ్యులు, ఎంటీ బాలపాప పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మహేష్

గుంటూరుఈస్ట్: వ్యక్తిని హత్య చేసిన నలుగురిని అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. అరండల్‌పేట స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ కె.వి.మహేష్, ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. వసంతరాయపురానికి చెందిన చిలుకా రాజు ప్రేమపేరుతో ఓ మైనర్ యువతిని వంచించిన పోక్సో కేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. యువతి కుటుంబసభ్యులు చిలుకా రాజును హత్య చేసేందుకు బ్యాంకు కాలనీకి చెందిన కంచర్ల దేవానందంకు భారీ మొత్తంలో డబ్బులు ఇచ్చినట్లు రాజుకు సమాచారం తెలిసింది. దీంతో రాజు దేవానందంపై కక్ష పెంచుకున్నాడు. దేవానందం హత్యకు పథకం వేశాడు. అతని స్నేహితులు చింతగుంట్ల ప్రవీణ్, కూకట్లపల్లి సందీప్, పల్లె రాజుల సహాయం కోరాడు. హత్యకు ఆన్‌లైన్‌లో కత్తులు కొనుగోలు చేశాడు. హత్య చేసేందుకు అవకాశం కోసం ఎదురు చూశాడు. ఈనెల 22వ తేదీ దేవానందం మద్యం సేవిద్దామని నిందితులైన నలుగురిని పిలిచాడు. అందరూ కలిసి దేవానందం కారులో బార్‌కు వెళ్లి మద్యం తాగారు. అనంతరం అందరూ కారులో రాజీవ్‌గాంధీనగర్ మెయిన్‌రోడ్డు వద్ద కారు ఆపారు. దేవానందం మూత్ర విసర్జన కోసం వెళ్లగా నిందితులు నలుగురు కత్తులతో దాడిచేసి విచక్షణా రహితంగా పొడిచారు. దేవానందం ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేసిన పోలీసులు గురువారం చిలుకా రాజు, చింతగుంట్ల ప్రవీణ్, కూకట్లపల్లి సందీప్, పల్లె రాజులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కేసు పురోగతిలో కృషి చేసిన ఎస్‌హెచ్ఓ వెంకటేశ్వరరెడ్డి, ఎస్సై టి.నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావులను డీఎస్పీ అభినందించారు.

జూన్ 5వరకు దుకాణాలు మూసేయండి

వ్యాపారస్తులకు సూచించిన చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

నరసరావుపేట: జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశాల మేరకు జూన్ 2, 3, 4, 5 తేదీల్లో షాపులు మూసివేయాలని చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తూరి కిషోర్‌బాబు, ప్రధానకార్యదర్శి గాదంశెట్టి రామకృష్ణ వ్యాపారస్తులను కోరారు. ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా జరిగిన అవాంఛనీయ సంఘటనలను దృష్టిలో పెట్టుకొని గురువారం ఎస్పీని జిల్లా కార్యాలయంలో కలవటం జరిగిందన్నారు. వ్యాపారస్తులు ఒకటో తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటల వరకు మాత్రమే వ్యాపార లావాదేవీలు కొనసాగించాలని కోరారన్నారు. సంఘటనలను దృష్టిలో పెట్టుకొని వ్యాపారస్తులు షాపులు మూసివేసి పోలీసులకు సహకరించాలని కోరారని తెలిపారు.

కొల్లిశారదా మార్కెట్‌లోని షాపుల స్వాధీనానికి నోటీసులు

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న కొల్లిశారదా హోల్‌సేల్ కూరగాయాల మార్కెట్‌లో ఉన్న షాపుల లీజు కాలపరిమితి ముగియడంతో షాపుల స్వాధీనానికి నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. 1999లో నగరపాలక సంస్థ 88 షాపులతో కొల్లి శారదా కూరగాయాల మార్కెట్ కాంప్లెక్స్ నిర్మించింది. 25 ఏళ్ల లీజు గడువుతో షాపులను కొంత మంది దక్కించుకున్నారు. వీటిలో 25 ఏళ్ల లీజు గడువు పూర్తయిన 81 షాపులను నగరపాలక సంస్థకు అప్పగించాలని నోటీసులు జారీ చేశారు. 7 రోజుల్లో అప్పగించని పక్షంలో దుకాణాలకు తాళాలు వేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. మిగిలిన 7 షాపులకు 2027 దాకా లీజు గడువు ఉందని తెలిపారు.

వృక్ష విలాపం



అమరావతి-గుంటూరు రహదారిలో కాలిపడిపోయిన చింత చెట్లు

- ఆకతాయిలు, రియల్టర్ల ఇష్టారాజ్యం
- పట్టించుకోని అధికారులు
- నిలువ నీడ లేక అల్లాడుతున్న ప్రజలు



అమరావతి: గుంటూరు–అమరావతి మార్గంలో వందల ఏళ్ల నాటి చింత చెట్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వందల ఏళ్ల కిందట నాటిన మొక్కలు మహా వృక్షాలుగా పెరిగాయి. బాటసారులు, రైతులు, కూలీలు ఎండ, వానల నుంచి సేద తీరేవారు. అంతేకాక ప్రతి సంవత్సరం చింత చెట్ల ఫలసాయంతో ప్రభుత్వానికి ఆదాయం కూడా లభించేది. ఒక్కొక్కటి ఉనికిని కోల్పోతున్నాయి. ఆకతాయిల ఆగడాల వల్ల కొంతమేర చెట్లు తగలబడిపోగా, ఇటీవల రియల్ ఎస్టేట్ వెంచర్లు ముందున్న చింత చెట్లుకు రాత్రికి రాత్రే నిప్పంటుకున్న సంఘటనలు ఉన్నాయి. దీంతో చెట్ల సంఖ్య తరిగిపోతూ వస్తుంది. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ శాఖాధికారులు, పోలీసు శాఖ సహాయంతో రహదారి వెంట నిఘా ఏర్పాటుచేసి పచ్చని చెట్లకు నిప్పుపెట్టే ఆకతాయిలను, రాత్రికి రాత్రే చెట్లను ముక్కలుగా కోసి అమ్ముకునే వారిని కట్టడిచేసి, చెట్లను కాపాడి పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

తమ్ముడిని చంపిన అన్న అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌హెచ్ఓ దేవప్రభాకర్, పక్కన నిందితుడు (టీ షర్టు)

గుంటూరుఈస్ట్: తమ్ముడిని హత్య చేసిన ఘటనలో అన్నను లాలాపేట పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్ఓ దేవ ప్రభాకర్ గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 26న సంగడిగుంటలో అర్వపల్లి దుర్గారావు తన కుమార్తె జన్మదిన వేడుకలు చేసుకుంటున్నాడు. అదే సమయంలో తమ్ముడు సాంబయ్య అన్న వద్దకు వచ్చి మద్యానికి డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దుర్గారావు నిరాకరించడంతో సాంబయ్య ఘర్షణ పడ్డాడు. సాంబయ్య కర్రతో అన్న దుర్గారావును కొట్టాడు. దుర్గారావు కోపంతో సాంబయ్య చేతిలో కర్రను లాక్కొని తలపై గట్టిగా మోదాడు. సాంబయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని జీజీహెచ్‌కు తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా మేకల సుబ్బారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్–1938) రాష్ట్ర కార్యదర్శిగా గుంటూరు నగరానికి చెందిన మేకల సుబ్బారావు ఎన్నికయ్యారు. కృష్ణాజిల్లా గుడివాడలో జరిగిన సంఘ రాష్ట్ర నూతన కౌన్సిల్ సమావేశంలో భాగంగా మేకల సుబ్బారావును రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందు వెలాంగిణిరాజు, కట్టెబోయిన నరసింహారావు గురువారం తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా విశేష సేవలు అందిస్తున్న సుబ్బారావు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల సీనియర్ నాయకులు ఏవీ రామారావు, విజయానంద్, గౌరవాధ్యక్షుడు సూర్యప్రకాశరావు, మాజీ అధ్యక్షుడు ఎంవీ ప్రసాద్, నాయకులు సాయన్న, జోజప్ప, శివశంకర్, శ్రీనివాసరావు, నాగరాజు, గురజాల శ్రీనివాసరావు తదితరులు అభినందనలు తెలిపారు.

భాషాసంస్కృతుల పరిరక్షణే ధ్యేయం



అధ్యాపకులు, ఉపాధ్యాయులను సత్కరించిన బాపయ్యచౌదరి, రామినేని సత్య, ఎమ్మెల్సీ లక్ష్మణరావు



చల్లపల్లికి చెందిన ఛాత్రగడ్డ శ్రీనివాస్ డప్పులతో బృంద ప్రదర్శన

- ఉత్తర అమెరికా తెలుగు సంఘ (నాట్స్) అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి
- నాట్స్ ఆధ్వర్యంలో ఘనంగా జానపద, సాంస్కృతిక సంబరాలు
- ఏపీ, తెలంగాణ నుంచి తరలివచ్చిన కళాకారులు
- కళాకారులు, కవులు, ఉపాధ్యాయులకు సత్కారం

గుంటూరు ఎడ్యుకేషన్: భాషా, సంస్కృతుల పరిరక్షణే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) అధ్యక్షుడు నూతి బాపయ్యచౌదరి పేర్కొన్నారు. నాట్స్ ఆధ్వర్యంలో గురువారం గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జానపద, సాంస్కృతిక సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పెదనందిపాడు గ్రామానికి చెందిన తాను ఉపాధ్యాయ వృత్తి నుంచి అంచెలంచెలుగా ఎదిగి అమెరికాలోని నాట్స్ అధ్యక్షుడిగా అయిన తీరును వివరించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయ పరిరక్షణకు నాంది పలుకుతూ సేవే రమ్యం–భాషే గమ్యం నినాదంతో నాట్స్ ముందుకు వెళుతోందని చెప్పారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో మరుగునపడిన జానపద కళలు, కళాకారులు, సాహిత్యకారులను వెలుగులోకి తీసుకురావాలనే ఆశయంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏపీ, తెలంగాణా నుంచి వచ్చిన కళాకారులు అద్భుతమైన ప్రదర్శన లిచ్చారని కొనియాడారు. అమెరికాకు వస్తున్న తెలుగు ప్రజలకు నాట్స్ ఆధ్వర్యంలో అవసరమైన సహాయ, సహకారాలను అందిస్తున్నట్లు చెప్పారు. మరుగునపడిపోతున్న కళాకారులను గుర్తించి వారికి సముచిత గౌరవం కల్పించడంతోపాటు ఉపాధ్యాయుల సేవలను స్మరించుకునేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మూలాలను మరువకుండా నాట్స్ అధ్యక్షుడు బాపయ్యచౌదరి సహృదయంతో ఏర్పాటు చేసిన జానపద–సాంస్కృతిక సంబరాలలో తాము భాగస్వాములమయ్యామని చెప్పారు. జానపద కళారూపాలను పరిరక్షించి, కళాకారులకు చేయూత అందించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఈ సందర్భంగా తెలంగాణకు చెందిన ప్రముఖ రచయిత, గాయకుడు చింతల యాదగిరితోపాటు బుర్రకథ పితామహుడు నాజర్ తనయుడు బాపూజీ, సినీ, నాటక రంగ నటుడు కృష్ణేశ్వరరావు, ప్రముఖ ప్రజా గాయకులు రంగం రాజేష్, రమణను సత్కరించారు. అదే విధంగా డాక్టర్ రావి అరుణ, డాక్టర్ శ్రీలత, పీవీ మల్లేశ్వర్, పాటిబండ్ల విష్ణువర్ధన్, కన్న మాస్టారు సహా 25 మంది అధ్యాపక, ఉపాధ్యాయులను సత్కరించారు.

అద్భుతమైన ప్రదర్శనలు

కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు అద్భుతమైన ప్రదర్శనలు ఇచ్చారు. సూర్యాపేటకు చెందిన సంధ్య జానపద గానంతో ఇచ్చిన ప్రదర్శన, చింతూరుకు చెందిన కొమ్ము బుర్ర కళాకారుల ప్రదర్శన, చింతల యాదగిరి తనయ ధామిని గుర్రం జాషువా పద్య ఆలాపన, రంగ రాజేష్ అమ్మపాట, లెనీనా తెలుగుపాట, చల్లపల్లికి చెందిన ఛాత్రగడ్డ శ్రీనివాస్ బృందం దప్పుతో గాన ప్రదర్శన ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాట్స్ డల్లాస్ ప్రతినిధి రామినేని సత్య, బాపయ్యచౌదరి తల్లిదండ్రులు సీతాదేవి, సుబ్బారావు, కార్యక్రమ నిర్వహణ సభ్యులు దాసరి శివ, దాసరి వెంకట సుబ్బారావు, కాకుమాను నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ M.S.M. Inter (V) College, Guntur 10th Pass అయిన వారికి MLT, MPHW (నర్సింగ్) Agriculture, Veterinary Course లకు అడ్మిషన్స్ జరుగుచున్నవి. 7386706839, 7386406839

PARAMEDICAL
■ ప్రభుత్వ పారామెడికల్ కోర్సులకు అడ్మిషన్లు DMLT, Ophthalmic, Radio graphic, Medical Imaging, Anesthesia, Cardiology, OT Technician, Dialysis, Optometry ECG, Cathlab, Health Assistant, విద్యార్హత : ఇంటర్ ఎనీ గ్రూప్ స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు. పరమేశ్వరి కాలేజి ఆఫ్ పారామెడికల్ సైన్సెస్, ఒంగోలు. ✆ 72075 55666, 96408 24225

REAL ESTATE
FLAT FOR SALE
■ గుంటూరు, కృష్ణనగర్, 3వలైను, శ్రీ వనమాలి టవర్స్, 5వ ఫ్లోర్‌లో 1670Sft, 3BHK కార్ పార్కింగ్‌తో అమ్మకమునకు కలదు. 9441926809, 9441128872

PLOT FOR SALE
■ 22సెంట్లు భూమి రూ.7,50,000/- స్పాట్ రి. ఒకే పెట్టుబడిపై 3 ఆదాయాలు. అవకాడో ఫ్రూట్ పై ప్రతీ సం॥ లక్షల్లో ఆదాయం. అద్దంకి దగ్గర్లో గుంటూరు నుండి గంట ప్రయాణం. 8317528192

■ గుంటూరు మార్కెట్ నుండి 12 km దూరంలో చింతపల్లిపాడు గ్రామానికి అనుకొని ల్యాండ్ కన్వర్షన్ ప్లాట్స్ 111 గజాలు (25x40) 375000/- మాత్రమే. 9492939269

TO-LET COMMERCIAL
■ గుంటూరు హరిహరమహల్ సినిమా హాల్ వెనుక ఇండియన్ బ్యాంక్‌పైన 1st ఫ్లోర్ 3000 Sft కమర్షియల్ ఆఫీసులకు అద్దెకు ఇవ్వబడును. Ph: 9848566343

SERVICES
BUSINESS OFFER
■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది.వ్యక్తిగత,విద్య,టేక్ఓవర్, అగ్రికల్చర్ ఏజెంట్‌కావలెను.DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు, ✆ 9253560455.

■ మేము మీ వ్యాపారాన్ని అభివృద్ధి చేయ దానికి పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నాము. అలాగే ఏజెంట్లను కూడా ఆహ్వానిస్తున్నాము. ఫోన్: 9092692408

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

WANTED
■ Wanted Male Campus incharges, Male Marketing Vice Principals and Executives. Qualification Any Degree Must be married. Salary Upto Rs.20000/- Place of work Master Minds College, Guntur. Contact: 9248733344

■ Wanted Female Campus incharges Qualification Any Degree / B.Tech. must be married. Age: 30+ place of work Guntur. Salary Upto Rs.15000/- Master Minds. 3/11, Brodipet, Guntur. Contact: 9100024059

■ నరసరావుపేటలోని రెడ్డి బాలుర హాస్టలు నందు సూపర్‌వైజరు కావలెను. అర్హత: మినిమమ్ ఇంటర్ వయస్సు: 35సం॥ నుండి 50సం॥ వరకు. సం॥ 9866808880, 9848422878

■ గుంటూరులోని మా భూమి రియల్‌ఎస్టేట్ నందు పనిచేయుటకు మార్కెటింగ్ సిబ్బంది మరియు లేడి టెలికాలర్స్ కావలెను. 9154321444, 8500174527

■ KSR ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ నందు సీనియర్ అకౌంటెంట్ (2 సం॥ అనుభవం+ ట్యాలీ) మరియు ఆఫీస్ బాయ్స్ కావలెను. అ: ఇంటర్ ఆపైన. ఆకర్షణీయమైన జీతం. సంప్ర: 99637 84919

■ ప్రముఖ MNC నందు పనిచేయుటకు మార్కెటింగ్ అనుభవం,ఆసక్తిగలవారు కావలెను. వ: 30 సం॥ ఆపైన, స్త్రీ/పు॥ సీనియర్ సిటిజన్స్‌కు ప్రాధాన్యత జీ.50000/-నోటార్గెట్స్,నోఫీజ్. 9515980476

■ విజయ్ ఈ–ఫైనాన్స్ ఆఫీసు నందు పనిచేయుటకు M.S.ఆఫీసు, DTPలో అనుభవం ఉన్న కంప్యూటర్ ఆపరేటర్, తెలుగు & ఇంగ్లీషు వచ్చిన లేడీస్ స్టాఫ్ కావలెను, తెనాలి.✆9032244425 / 9618483836

■ అనుభవం గల సేల్స్ మెన్స్ కావలెను. మమత మెడికల్స్, గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద, గుంటూరు. సంప్ర॥ ✆9849478518, 9346560016, 0863-2224688

■ గుంటూరులోని ప్రముఖ హాస్పిటల్ నందు మార్కెటింగ్ చేయుటకు MBA అర్హత గల అభ్యర్థులు కావలెను. Cont: zrexbus@gmail.com ✆ 8978396042

■ ప్రముఖ సెక్యూరిటీ సంస్థ నందు గుంటూరులోని లక్ష్మీపురం ఏరియాలలో చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ (Male)కావలెను డ్యూటీ: 12 గం, జీతం 13000, Q: 10th Pass/Ffail. ✆ 9676107681

■ నరసరావుపేట యలమంద డిపోలో ప్రముఖ కంపెనీకి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ: 12గం, జీ: 10,500+ ఇన్సెంటివ్స్, రూమ్ ఫ్రీ, సబ్సిడీపై భోజన వసతి, ESI, PF. ✆ 73866 88787

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217

■ గుంటూరు & ప్రకాశం ప్రముఖ బ్యాంకింగ్ కలెక్షన్ ఏజెన్సీలో ఫీల్డ్ కలెక్షన్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేయుటకు ఆసక్తి గల టూ వీలర్ ఉన్న యువకులు కావలెను. Q: Int, Deg. Sal: 15,000 to 20000 ✆ 83413 20249

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4లైన్స్)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.